సాక్షి ప్రకాశం

శుక్రవారం । 7 । మార్చి । 2025



మూగ వేదన.. రైతుల రోదన

పశ్చిమ ప్రకాశంలోని వందకుపైగా గ్రామాల్లో పశుగ్రాసం కొరతతో పశువులు, వాటి పోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - 8లో..



నిద్ర చేసి వస్తూ..

తండ్రి మృతిచెందిన నేపథ్యంలో సోదరి ఇంటికెళ్లి నిద్రచేసి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై యాక్సిస్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మృతిచెందాడు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
36/25

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

శుక్రవారం	ఇఫ్తార్	
సాయంత్రం	గం 6 : 27	
శనివారం	సహారి	
ఉదయం	గం 5 : 07	

న్యూస్‌రీల్

వైఎస్సార్ విగ్రహంపై దాడి జుగుప్సాకరం

● వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి

ఒంగోలు సిటీ: జనహృదయనేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై దాడి చేయడం జుగుప్సాకరమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఒంగోలు రెడ్డి హాస్టల్లోని వైఎస్సార్ విగ్రహంపై బుధవారం కొందరు యువకులు దాడి చేయడంపై గురువారం ఆయన స్పందించారు. కొందరు విద్యార్థులు విపరీత ధోరణితో వైఎస్సార్ విగ్రహంపై దాడి చేయడమంటే కులాల మధ్య చిచ్చుపెట్టే అవకాశం లేదా అని ప్రశ్నించారు. విద్యార్థులు అన్ని కులాలకు సంబంధించిన వారు ఉంటారన్నారు. వీరందరి ఉజ్వల భవిష్యత్ కోసం వైఎస్సార్ చేసిన మేలును మరిచారా అని ప్రశ్నించారు. వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ కండువాలు కప్పి సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించారన్నారు. వృత్తి పరంగా వైద్యుడైన వైఎస్సార్.. ప్రజా జీవితంలోకి వచ్చి సర్వజనులకు సేవలందించిన మహనీయునిగా ముద్ర వేసుకున్నారన్నారు. పాదయాత్ర తర్వాత సర్వజనుల నిజజీవితాలను గుర్తించి సంస్కరణలు రూపొందించి నిరుపేదలను సైతం ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. అందరి ఉన్నతికి బాటలు వేసిన మహానేతను అవమానించడం సమంజసం కాదంటూ హితవు పలికారు.

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి డోలా, ఎస్పీ దామోదర్, తదితరులు

మార్కాపురం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 8వ తేదీ మార్కాపురం వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లపై గురువారం రాత్రి మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురంలో సమీక్ష నిర్వహించారు. తర్లుపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్, సభా వేదిక, తదితర ప్రాంతాలను పరిశీలించారు. వారి వెంట జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ త్రివినాగ్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను ఎస్పీ దామోదర్ పరిశీలించారు. హెలీప్యాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, కాన్వాయ్ మార్గాలను తనిఖీ చేసి పలు సలహాలు, సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ నాగరాజు, ఎస్ఎస్‌జీ డీఎస్పీ పోతురాజు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సీఐ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

నేరాల కట్టడిలో డ్రోన్ కెమెరాల పాత్ర కీలకం

● ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో డ్రోన్ కెమెరాలు చాలా ఉపయోగపడతాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. నిఘా అవసరాల కోసం కామేపల్లి గ్రామానికి చెందిన ఏలూరు రాంబాబు జిల్లా పోలీసు శాఖకు అత్యంత ఆధునిక సాంకేతికతతో కూడిన డ్రోన్ కెమెరాను గురువారం బహూకరించారు. స్థానిక ఎన్జీఆర్ కళాక్షేత్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎస్పీ దామోదర్‌కు ఈ డ్రోన్ కెమెరా అందజేశారు. ఆ కెమెరాను వెంటనే జరుగుమల్లి పోలీసు స్టేషన్‌కు ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతానికి 30 కెమెరాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో నేరాలు జరిగే ప్రాంతాలకు డ్రోన్ కెమెరాలు పంపించి నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్య కూడళ్లలో కూడా డ్రోన్ కెమెరాలతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సింగరాకొండ సీఐ హజరత్తయ్య, జరుగుమల్లి ఎస్ఐ మహేంద్ర పాల్గొన్నారు.

● ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ఆయన మాటే శాసనం

● కీలకమంత్రికి బినామీగా.. రాజ్యాంగేతర శక్తిగా

● మంత్రి పేరు చెప్పి కళాశాలలో పెత్తనం

● నిబంధనలకు విరుద్ధంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు

● ఒకే సామాజిక వర్గానికి పెద్దపీట

● కాలేజీ సిబ్బందిపైనా అరాచకాలు

● విధులకు హాజరుకాకుండా ఫోర్జరీ సంతకాలతో జీతాలు



బినామీ కులకలం!

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రతిష్టాత్మక ఒంగోలు ట్రిపుల్ ఐటీ కాలేజీలో ఆయన చెప్పిందే వేదం.. ఆయన ఆ కళాశాలలో పనిచేయరు..ఆయనకు ఆ కాలేజీకి ఎలాంటి సంబంధం లేదు. కాని ఆయన మాటే అక్కడ శాసనం..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకే గ్రామానికి చెందిన 50 మందికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలిప్పించిన ఘనత ఆయనది. ప్రభుత్వంలో కీలక మంత్రికి ఆయన బినామీ. దీనికి తోడు కాలేజీలో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది కొందరు సహకరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఎవరా 'శక్తి'

ఇతను ఓ ఎన్నారై. ఆయన స్వగ్రామం కందుకూరు మండలం ఎడ్లూరుపాడు. ఒంగోలు నగరంలో ఓ జూనియర్ కాలేజీ కూడా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వంలో కీలకంగా ఉండే ఓ మంత్రికి ఆయన బినామీ అని ప్రచారం జరుగుతోంది. సదరు మంత్రి సాన్నిహిత్యంతోనే ట్రిపుల్ ఐటీ కళాశాల వ్యవహారాల్లో మితిమీరి జోక్యం చేసుకోవడమే కాకుండా కాలేజీ పెద్దలను సైతం మంత్రి పేరు చెప్పి బెదిరించి పెత్తనం చలాయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పచ్చదండు కన్ను...

ఒంగోలు ట్రిపుల్ ఐటీ కాలేజీకి సంబంధించి క్యాంపస్-2, క్యాంపస్-3 ఒంగోలు నగరంలో ఉండగా, కడప ఆర్కే వ్యాలీలో క్యాంపస్-1 ఉంది. ఒంగోలు ఎస్ఎస్ఎన్ కాలేజీలో క్యాంపస్-2 నిర్వహిస్తుండగా, దక్షిణ బైపాస్‌లోని రావ్ అండ్ నాయుడు ఇంజినీరింగ్ కాలేజీలో క్యాంపస్-3 నడుస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు ఈ కాలేజీపై కన్నేశారు. ఎలాగైనా సరే కాలేజీపై పెత్తనం కొనసాగించాలని ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా ట్రిపుల్ ఐటీ కాలేజీకి సంబంధించి నగరంలోని రెండు క్యాంపస్‌లలో సుమారు 50 మంది టీడీపీ కార్యకర్తలకు ఎలాంటి నోటిఫికేషన్లూ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఔట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు ఇప్పించారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఒకే కులం, ఒకే గ్రామానికి ఉద్యోగాలు...

ట్రిపుల్ ఐటీ కాలేజీలో పనిచేస్తున్న అధ్యాపకులతో సదరు ఎన్నారైకి మంచి సంబంధాలు ఉన్నాయని తెలిసింది. వారంతా కూడా ఆయన సామాజికవర్గానికి చెందిన వారే కావడం గమనార్హం. వారు ఆయనతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. వీరితో ఉన్న సన్నిహిత సంబంధాలతో ఆయన స్వగ్రామానికి చెందిన 50 మందికి నిబంధనలు పాటించకుండా ఔట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు ఇప్పించినట్లు సమాచారం. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలు లేకుండానే సదరు ఎన్నారై ద్వారా ఈ నియామకాలు జరిగినట్లు తెలుస్తుంది. సదరు మంత్రి ఆశీస్సులతోనే ఈ నియామకాలు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది.

కాలేజీలో ఎల్లో గ్యాంగ్ డెన్...

ఔట్ సోర్సింగ్ ద్వారా వీరిని కేర్ టేకర్, ల్యాబ్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్లు, ఐటీ టెక్నీషియన్లు, అటెండర్లు, సెక్యూరిటీ సిబ్బందిగా నియమించినట్లు చెబుతున్నారు. ఎగ్జామినేషన్ సెల్ పక్కనే ఉన్న ఒక గదిని వీరు డెన్‌గా ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. కాలేజీకి వచ్చి బయోమెట్రిక్ వేసి గదిలోకి వెళ్లిపోయి టైం పాస్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఎల్లో గ్యాంగ్ చేష్టలకు ట్రిపుల్ ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు భయపడి మిన్నకుండిపోతున్నట్లు తెలిసింది. వీరి ఆగడాలను తట్టుకోలేక కళాశాల నిర్వాహకుల దృష్టికి తీసుకువెళితే.. వారు సైతం తలలు పట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఫోర్జరీ సంతకాలతో జీతాలు...

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఎల్లో గ్యాంగ్ కాలేజీ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇటీవల ఒక మహిళా ఉద్యోగిని 20 రోజులకుపైగా విధులకు హాజరుకాకపోయినప్పటికీ రిజిస్టర్లో ఎల్లో గ్యాంగ్ సభ్యులే ఆమె సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు సమాచారం. ఇదే కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగి కూడా 15 రోజులకుపైగా గైర్హాజరైనప్పటికీ ఎల్లో ముఠా సభ్యులు సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. విధులకు రాకుండానే జీతాలు తీసుకున్నట్లు సమాచారం. అంతేగాకుండా కాలేజీ సిబ్బంది సెలవు పెట్టాలన్నా, వ్యక్తిగత పనుల మీద క్యాంపస్ దాటి బయటకు వెళ్లాలన్నా డైరెక్టర్ అనుమతి తీసుకోవడం తప్పనిసరి. కానీ, ఈ ఎల్లో గ్యాంగ్ ఉద్యోగులు మాత్రం డైరెక్టర్‌కు చెప్పాపెట్టకుండానే సెలవులు పెట్టడం, క్యాంపస్ నుంచి బయటకు వెళ్లి రావడం చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా, కాలేజీలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులను చిన్నచూపు చూస్తున్నట్లు సమాచారం.

చీటికీమాటికీ వారిమీదకు ఒంటి కాలితో వెళ్లడమే కాకుండా 'రాష్ట్రంలో మా ప్రభుత్వం అధికారంలో ఉంది. మా వెనుక ప్రభుత్వ పెద్దలు ఉన్నారు. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు' అంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు బడుగు బలహీన వర్గాలకు చెందిన ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

● వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ



మాట్లాడుతున్న దుంపా రమణమ్మ

ఒంగోలు సిటీ: రేపు జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ పిలుపునిచ్చారు. గురువారం ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రమణమ్మ మాట్లాడారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవంలో భాగంగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను సన్మానించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. విలేకర్ల సమావేశంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు భూమిరెడ్డి రమణమ్మ, ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షురాలు బడుగు ఇందిర, హనుమంతునిపాడు ఎంపీపీ గాయం సావిత్రి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షురాలు పేరం ప్రసన్న, జి.మేరీ, సయ్యద్ అప్సర, పార్టీ జిల్లా సెక్రటరీ జాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహాన్ని అవమానపరిచిన విద్యార్థుల సస్పెన్షన్

ఒంగోలు టౌన్: స్థానిక రెడ్డి హాస్టల్లో బుధవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి టీడీపీ జెండాలు కట్టి అవమానించిన విద్యార్థులపై క్విస్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ ఘటనకు పాల్పడిన ఆరుగురు విద్యార్థులను సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న వి.హేమంత్, జి.రితీష్, బీవీ చక్రధర్, పి.విష్ణు, పి.మణి, కె.భానులను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు తెలియజేసింది. తదుపరి నిర్ణయం వరకు వీరి సస్పెన్షన్ అమలులో ఉంటుందని తెలిపింది.

పన్ను 13 వేలు..
జరిమానా 20 వేలు!

● నగరపాలక సంస్థలో పన్ను పేరుతో జులుం.!

● పన్నుల భారంతో ప్రజలు విలవిల

● మంచినీటి కనెక్షన్ లేకపోయినా పన్ను కట్టమంటూ ఒత్తిడి

● వారం టైం ఇవ్వమని అడిగినా.. ససేమిరా అంటున్న ఉద్యోగులు

● ఉద్యోగుల వేధింపులతో చిరువ్యాపారులు, సామాన్య ప్రజల బెంబేలు



ఒంగోలు టౌన్:

ఆస్తి పన్ను, నీటి పన్నుల వసూళ్ల విషయంలో ఒంగోలు నగరపాలక సంస్థ ఉద్యోగుల వ్యవహారశైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 31వ తేదీతో ఆర్థిక సంవత్సరం గడువు ముగుస్తుండటంతో పన్ను బకాయిల వసూళ్లపై నగరపాలక సంస్థ రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులు ఒక్కసారిగా ప్రజలపై ఒత్తిడి పెంచి జులుం ప్రదర్శిస్తున్నారు. పన్నుల వసూళ్లపై ఇన్నాళ్లూ నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రస్తుతం ఏకంగా మంచినీటి కుళాయిలు కట్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అంతేగాకుండా అసలు పన్ను కంటే జరిమానాలు రెట్టింపు వేసి జనాన్ని వేధిస్తున్నారు. మంచినీటి కనెక్షన్ లేకపోయినా సరే నీటి పన్ను కట్టమంటూ విడ్డూరంగా మాట్లాడుతుండటంతో నగర ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

స్పెషల్ డ్రైవ్ పేరుతో వేధింపులు...

ఒంగోలు నగరంలోని సంతపేట, సుజాతనగర్, ఆర్‌పీ రోడ్డు, పీవీపీ రోడ్డు, రాజీవ్ నగర్‌లో పన్నుల వసూళ్లపై బుధవారం నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల తీరుతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కరోనా మహమ్మారి దెబ్బకు నగరంలో అనేక మంది వ్యాపారాలు దెబ్బతిన్నాయి. రెండేళ్లపాటు వ్యాపారాలు లేక నష్టాలపాలయ్యారు. రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలు, సామాన్యులు కుటుంబ పోషణ కూడా కష్టమై ఇబ్బందులు పడ్డారు. దాంతో అనేక మంది ఇంటిపన్నులు, మంచినీటి కుళాయి పన్నులు చెల్లించలేక పోయారు. మానవతా దృక్పథంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పన్ను వసూళ్ల విషయంలో ప్రజలపై ఒత్తిడి చేయలేదు. దాంతో అనేక మంది సామాన్యులు, చిరువ్యాపారులు పన్ను బకాయిపడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో సకాలంలో పన్నులు చెల్లించని పౌరులను నగరపాలక సంస్థ అధికారులు దొంగల్లాగా చూస్తున్నారని కొందరు మండిపడుతున్నారు. పన్నులన్నీ చెల్లించాలంటూ ఒకేసారి తీవ్రమైన ఒత్తిడికి గురిచేయడంపై ఆందోళన చెందుతున్నారు.

కుళాయి మంజూరు చేయకుండానే పన్ను..!

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమృత్ పథకంలో మంచినీటి కుళాయి కోసం నాగాంజనేయులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ, కుళాయి మంజూరు చేయకుండానే దానికి పన్ను వేశారు. ఇప్పుడు తాజాగా నగరపాలక సంస్థ అధికారి భాస్కర్ మంచినీటి కనెక్షన్ పీకేస్తామని చెప్పడంతో ఆయనకేమీ పాలుపోలేదు. అయ్యా.. నాకు నగరపాలక సంస్థకు సంబంధించిన మంచినీటి కుళాయి కనెక్షనే లేదు.. నా సొంత ఖర్చులతో ఇంట్లో బోరు వేసుకున్నానని ఆయన చెప్పుకున్నారు. అయినప్పటికీ ఆర్‌ఓ వినలేదు. బోరు కనెక్షన్ పీకేస్తామంటూ హెచ్చరించడమే కాకుండా దురుసుగా ప్రవర్తించినట్లు బాధితుడు వాపోయాడు. పన్ను కట్టేందుకు కాస్త సమయం ఇవ్వమని బతిమాలినప్పటికీ వినకుండా అవమానకరంగా మాట్లాడినట్లు చెపుతున్నారు. జరిమానాతో సహా పన్ను కట్టకపోతే నీవు ఎలా వ్యాపారం చేసుకుంటావో చూస్తానంటూ వార్నింగ్ ఇవ్వడంతో భయాందోళనకు గురైన నాగాంజనేయులు.. కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఇది కేవలం నాగాంజనేయులు సమస్య మాత్రమే కాదు. గత కొన్ని రోజులుగా నగరంలోని అనేక మంది ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య అని ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. పన్నులు చెల్లించడానికి ప్రజలకు మరికొంత సమయం ఇవ్వాలని, పెద్ద మొత్తంలో బకాయిలున్న వారికి విడతల వారీగా పన్నులు చెల్లించుకునే వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేగాకుండా పన్నుల మీద విధించిన జరిమానాలను ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు.

రెట్టింపు జరిమానాలతో బెంబేలు...

పన్నులు కడితే సరేసరి.. లేకపోతే ఇంటి కుళాయి కనెక్షన్లు కట్ చేస్తామంటూ నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు ప్రజలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. అయితే, పన్నుల వరకైతే అప్పోసొప్పో చేసి చెల్లించే వారిమని, కానీ, రెట్టింపు జరిమానాలు వేసి కడతారా.. చస్తారా..? అంటూ ఒత్తిడి చేస్తే ఎలాగని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని మంగమూరు రోడ్డులో నివాసముంటున్న పెరకం నాగాంజనేయులుకు నగరపాలక సంస్థ ఉద్యోగులు ఇంటి పన్ను కట్టాల్సిందిగా గురువారం నోటీసులిచ్చారు. అసలు పన్ను 13 వేల రూపాయలు కాగా, దానికి జరిమానా 20 వేల రూపాయలు వేయడంతో ఆయన బిత్తరపోయారు. మొత్తం 33 వేల రుపాయలను సాయంత్రంలోపు కట్టకపోతే మీ ఇంటి మంచినీటి కుళాయి కనెక్షన్ పీకేస్తామంటూ నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారి భాస్కర్ బెదిరింపులకు దిగినట్లు నాగాంజనేయులు తెలిపారు.

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం అవసరం

● యూత్ పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరించిన ఏకేయూ వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు



యూత్ పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు, తదితరులు

ఒంగోలు సిటీ: దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం ఎంతో అవసరమని స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీ (ఏకేయూ) వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు అన్నారు. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిపాలనా భవనం వద్ద ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ పోస్టర్‌ను గురువారం వారు లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారిన కాలానికి అనుగుణంగా యువత తమ మేధాసంపత్తితో ప్రతి రంగంలోనూ భారతావనిని ప్రపంచంలోని అన్ని దేశాల కంటే ముందుకు తీసుకెళ్లాలన్నారు. యువత యూత్ పార్లమెంట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలన్నారు. నేడు దేశానికి యువత అవసరం ఎంతో ఉందన్నారు. జిల్లాలోని యువత ఈ సదావకాశాన్ని వినియోగించుకుని దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. విక్రమ సింహపురి యూనివర్శిటీలో జరిగే యూత్ పార్లమెంట్ పోటీల్లో 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు గల ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలోని యువత పాల్గొనవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి గల యువతీ యువకులు ముందుగా మై భారత్ పోర్టల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ఒక్క నిమిషం కాలం నిడివి కలిగిన 'వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ' అనే అంశంపై వీడియో తీసి మార్చి 9వ తేదీ అర్ధరాత్రి 12 గంటల్లోపు అప్లోడ్ చేయాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్ యువతీ యువకులకు సూచించారు. యూత్ పార్లమెంట్ పోటీల్లో ఆంధ్రకేసరి యూనివర్శిటీ విద్యార్థులు, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన యువతీ యువకులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనే విధంగా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏకేయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.నిర్మలామణి, నెహ్రూ యువ కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ కమల్ షా, సహాయ ఆచార్యులు డాక్టర్ ఉబ్బా ఈతముక్కల, జాస్మిన్, ఎన్.ఎస్.ఎస్ వలంటీర్లు, ఏకేయూ బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ప్రావీణ్యం

● పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి

● ఘనంగా మహిళా దినోత్సవం ముందస్తు వేడుకలు



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి

ఒంగోలు సిటీ: ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించి తమకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి అన్నారు. ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం ఒంగోలు అంబేడ్కర్ భవన్ ప్రాంగణంలో ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ మహిళలు సమాజంలో ప్రత్యేక స్థానం సంపాదించుకునేందుకు ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తోందనారు. నేటి కాలంలో పురుషులకు సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. స్త్రీ అనుకుంటే ఏ రంగంలోనైనా విజయం సాధించేలా కష్టపడుతుందన్నారు. మార్కాపురం డీడీ డాక్టర్ రాఘవయ్య మాట్లాడుతూ విద్యారంగంలో, వైద్యరంగంలో నేడు మహిళలే అగ్రస్థానంలో ఉన్నారన్నారు. కుటుంబంతో పాటు చేసే పనిని కూడా సొంత పనిగా చేయగల శక్తి మహిళలకే ఉందన్నారు. వీపీసీ డీడీ డాక్టర్ జగత్ శీనివాసరావు మాట్లాడుతూ తల్లిగా, చెల్లిగా, భార్యగా తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మహిళలు.. నేడు అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. అనంతరం స్టేట్ యూనియన్ ప్రెసిడెంట్ రాజేష్, ప్రకాశం యూనియన్ ప్రెసిడెంట్ వాసు తిరుపాలు, గురవయ్య, శశి పలువురు నాయకులు మాట్లాడారు. మహిళలందరూ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ మహిళా సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్ పరీక్షకు 1562 మంది గైర్హాజరు

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు మూడో రోజు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మూడో రోజు 23,827 మందికి గాను 22,265 మంది విద్యార్థులు హాజరు కాగా 1562 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ 21,617 మంది విద్యార్థులు గాను 30,378 మంది హాజరవగా, 1239 మంది గైర్హాజరు అయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 2210 మందికి గాను 1887 మంది హాజరవగా 323 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో 67 సెంటర్లలో పరీక్షలు సాగాయి. ఆర్ఐఓలు ఆరుగురు, 8 మంది డీఈసీ, డీఐఈఓలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. 35 మంది స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి

- వీధి దీపాల ఏర్పాటుకు స్తంభం ఎక్కిన సమయంలో ప్రమాదం


మృతిచెందిన వెంకట రమణ

బేస్తవారిపేట: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఎంపీ చెరువులో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని జేబీకేపురానికి చెందిన మీనిగ వెంకట రమణ(24) ఐటీఐ పూర్తి చేశాడు. ఎలక్ట్రీషియన్ పని నేర్చుకుందామని తన సమీప బంధువైన జూనియర్ లైన్‌మెన్‌తో కలిసి రోజువారీ పనికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎంపీ చెరువు గ్రామంలో నాలుగు వీధుల్లో విద్యుత్ స్తంభాలు ఎక్కి వీధి దీపాలు ఏర్పాటు చేశాడు. పాఠశాల ఉన్న వీధిలో కొత్తపేట ఎస్సీకాలనీకి 11 కేవీ సింగల్‌ఫేజ్ విద్యుత్‌లైన్ గతంలో ఏర్పాటు చేసి ఉన్నారు. జూనియర్ లైన్‌మన్ వేరేచోట వీధి దీపాల పనులు చేస్తున్నాడు. ఈ విషయం తెలియని వెంకట రమణ 11 కేవీ విద్యుత్ లైన్ ఉన్న వీధిలోని విద్యుత్ స్తంభం ఎక్కిన సమయంలో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. ప్రమాదంలో తలపగిలి తీవ్రంగా గాయపడిన క్షతగాత్రున్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు ధృవీకరించారు. మృతుడి తండ్రి క్రిష్ణ మతిస్థిమితం లేక ఇంటి నుంచి వెళ్లి పోయాడు. తల్లి ఆదిలక్ష్మమ్మ వెంకట రమణనను కష్టపడి చదివించింది. చేతి కందివచ్చిన ఒక్కగానొక్క కుమారుడు అకాల మరణంతో బోరున విలపించింది.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని పార్టీ మండల అధ్యక్షులను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. దర్శి నగర పంచాయతీ అధ్యక్షునిగా ముతినేడి సాంబశివరావు, దర్శి మండల అధ్యక్షునిగా వెన్నపూస వెంకటరెడ్డి, ముండ్లమూరు మండల అధ్యక్షునిగా చింతా శ్రీనివాసరెడ్డి, దొనకొండ మండల అధ్యక్షునిగా కాకర్ల క్రిష్ణారెడ్డి, తాళ్లూరు మండల అధ్యక్షునిగా తూము వెంకట సుబ్బారెడ్డి, కురిచేడు మండల అధ్యక్షునిగా ఎన్నాబత్తుల వెంకట సుబ్బయ్యలను నియమించారు. అలాగే యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం మండల అధ్యక్షునిగా ఏకుల ముసలారెడ్డి, దోర్నాల మండల అధ్యక్షునిగా గంటా రమణారెడ్డిలను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది.

మూగ వేదన.. రైతుల రోదన


గడ్డి కోసం గేదెలను పొలాలకు తీసుకెళ్తున్న పశుపోషకుడు


ట్రాక్టర్లపై వరిగడ్డి తరలిస్తున్న దృశ్యం

- పశ్చిమ ప్రకాశంలో 100 గ్రామాల్లో గ్రాసం కొరత
- ట్రాక్టర్ గడ్డి రూ.15 వేలు పైమాటే
- తగ్గుతున్న పాలదిగుబడి
- తల్లడిల్లుతున్న పాడి రైతులు

మార్కాపురం: గ్రామాల్లో గ్రాసం కొరడ ఏర్పడింది. గడ్డి ధరలు అమాంతం పెరిగిపోయాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ట్రాక్టర్ గడ్డి రూ.15 వేలకు పైనే పలుకుతోంది. దీంతో పాడి రైతులు ఏం చేయాలో తెలియక తల్లడిల్లుతున్నారు. ఎండుగడ్డి దొరికే పరిస్థితి లేకపోవడంతో పాడి పశువులను ఎలా బతికించుకోవాలోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వర్షాభావంతో గ్రాసం కొరత..

మార్చి ప్రారంభంలోనే ఎండ తీవ్రతతో అందరూ తల్లడిల్లిపోతున్నారు. గతేడాది అక్టోబర్ నుంచి వర్షాలు లేకపోవడంతో పశ్చిమ ప్రకాశంలో పశుగ్రాసం కొరత ఏర్పడింది. పశువులు గడ్డికొరతతో పాటు తాగునీటి సమస్య కూడా ఏర్పడింది. పశ్చిమ ప్రకాశంలో గ్రాసం కొరత కొనసాగుతుండటంతో గ్రామాల్లో పాలదిగుబడి తగ్గిపోతోంది. పశ్చిమ ప్రకాశంలోని సుమారు 100 గ్రామాల్లో పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీంతో రైతులు పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు వెళ్లి ట్రాక్టర్ గడ్డి రూ.15 వేలు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. గ్రాసం కొరత మూలంగా 4 లీటర్లు ఇచ్చే పాడిగేదె 2 లీటర్లే ఇవ్వడంతో పాల ఉత్పత్తి తగ్గిపోతోంది. మార్కాపురం మండలంలోని గజ్జలకొండ, మిట్టమీదపల్లె, కొండేపల్లి, భూపతిపల్లె, బిరుదులనర్వ, నికరంపల్లి, వేములకోట, రాచర్ల మండలంలోని ఆకవీడు, అరవీటి కోట, యర్రగొండపాలెం మండలంలోని గంగుపల్లి, పుల్లలచెరువు మండలంలోని గంగవరం, ముటుకుల, మర్రివేముల, శతకోడు, తదితర గ్రామాల్లో గ్రాసం కొరత ఉన్నట్లు తెలిసింది. అర్ధవీడు మండలంలోని పాపినేనివల్లె, పెద్ద కందుకూరు, కాకర్ల, కొమరోలు మండలంలోని ముక్తాపురం, రాజుపాలెం, కొమరోలు, కురిచేడు మండలంలోని గొల్లపాలెం, తర్లుపాడు మండలంలోని కేతగుడిపి, లక్ష్మక్కపల్లె, రాగసముద్రం, ఉమ్మారెడ్డిపల్లె, తాడివారిపల్లె, తదితర గ్రామాల్లో గ్రాసం కొరత ఉంది. డివిజన్‌లో ఆవులు, ఎద్దులు సుమారు 36 వేలు, గేదెలు 3,76,520 పాలిచ్చే గేదెలు సుమారు 1,19,200 ఉన్నాయి. ఒక గేదెకు రోజుకు 5కిలోల మేత అవసరం. 5కిలోల కంటే ఎక్కువగా తింటేనే పశువులు పాలు ఇస్తాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పాడిగేదెలను బతికించుకునేందుకే పోషకులు నానా కష్టాలు పడుతున్నారు. దాణా కూడా కిలో రూ.15 నుంచి రూ.25కు పెరిగింది. ట్రాక్టర్ గడ్డి రూ.15వేల చొప్పున కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నా దొరకటం లేదు. పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. సాధారణంగా ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు 5 లీటర్లు పాలు ఇచ్చే గేదె ప్రస్తుతం 3 లీటర్లు మాత్రమే ఇస్తుంది. ఎండుగడ్డి కూడా ఆశించినంతగా లేకపోవటంతో గేదెలకు పొదుపుగా వేస్తున్నారు. మార్కాపురం డివిజన్‌లో సుమారు 10 ప్రైవేట్ పాలడైరీలు పాలసేకరణ చేస్తున్నాయి.


గేదె పాలను సేకరిస్తున్న మహిళ

750 ఎకరాల్లో గడ్డి సాగు

పశ్చిమ ప్రకాశంలో గడ్డికొరతను అధిగమించేందుకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 750 ఎకరాల్లో గడ్డిసాగు చేపడుతున్నాం. ఎవరైనా పశుపోషకులు, రైతులు గడ్డిసాగును చేపడితే వారికి అనుమతి ఇస్తాం. గ్రామాల్లో సాగుచేసిన గడ్డిని తమకు వాడుకుని, మిగిలిన గడ్డిని అమ్ముకోవచ్చు. గడ్డి కొరత రాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాం.

– రాఘవయ్య, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్, మార్కాపురం

రూ.15 వేలు పెట్టి ట్రాక్టర్ కొన్నా..



వేసవికావడంతో గడ్డికొరత ఏర్పడింది. ఇటీవలే ట్రాక్టర్ గడ్డిని పల్నాడు ప్రాంతం నుంచి రూ.15వేల ప్రకారం కొనుగోలు చేసి తెచ్చాను. పొలాల్లో పచ్చిగడ్డి లేకపోవడంతో ఎండుగడ్డిమీదే ఆధారపడాల్సి వస్తుంది.

– సీహెచ్ చెంచిరెడ్డి, పిచ్చిగుంటపల్లి

మహిళలకు స్వీయ రక్షణ నైపుణ్యం అవసరం


కరాటేపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ దామోదర్

- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: మహిళలు స్వీయ రక్షణ నైపుణ్యాన్ని పెంచుకోవాలని, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. నేటి సమాజంలో మహిళలపై అనేక అకృత్యాలు జరుగుతున్నాయని, ఇలాంటి సమయంలో తమను తాము రక్షించుకునేలా తర్ఫీదు పొందాలని సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో వివిధ కళాశాలలకు చెందిన 600 మంది విద్యార్థినులకు స్వీయ రక్షణపై అవగాహన కల్పించారు. మార్చి 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు మహిళా సాధికార ఉత్సవాలు నిర్వహించిన పోలీసు శాఖ ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులకు ఓపెన్ హౌస్, వ్యాసరచన ,వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. సెల్ఫ్ డిఫెన్స్ అంటే కేవలం శారీరక శక్తి మాత్రమే కాదని, ప్రతికూల సమయాల్లో స్పందించే సామర్థ్యాన్ని పెంచుకోవడం కూడా సెల్ఫ్ డిఫెన్స్‌గా పేర్కొన్నారు. ఆత్మ రక్షణ మహిళలకు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుందని, మానసికంగా బలోపేతం చేస్తుందన్నారు. విద్యార్థినులు ఎక్కువగా స్మార్ట్ ఫోన్లు వాడవద్దని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో మంచి చదువులతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు. మహిళల కోసం జిల్లాలోని అన్నీ పోలీస్‌స్టేషన్లలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల రక్షణ కోసం పోలీసు శాఖ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అనంతరం ఏపీ పోలీసు కరాటే కోచ్ నల్లూరి మోహన్, సుబ్రహ్మణ్యంలు కరాటేలో కీలకమైన 10 టెక్నిక్‌లను సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, మహిళా పీఎస్ సుధాకర్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఆర్ఐ సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

- బంగారు ఆభరణాలు స్వాధీనం

సింగరాయకొండ: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని గురువారం సింగరాయకొండ రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు రూ.4 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల కాలంలో వరుస చోరీ ఘటనలు జరుగుతుండటంతో రైళ్లలో పోలీసుల గస్తీ పెంచారు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్‌లోని రెండో నంబర్ ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న నెల్లూరు పట్టణంలోని కబాలి పాలెంకు చెందిన కాయల ప్రసన్నకుమార్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి బంగారం, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఒంగోలు జీఆర్పీ ఎస్సై టి.అరుణకుమారి వివరించారు.


నిందితుడు, స్వాధీనం చేసుకున్న సొత్తుతో రైల్వే పోలీసులు

నిద్ర చేసి వస్తూ..!

- రోడ్డు ప్రమాదంలో అసిస్టెంట్ మేనేజర్ మృతి
- భార్య నిండు గర్భిణి


అశోక్ మృతదేహం

మద్దిపూడి: ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడటంతో ప్రైవేట్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని రేగలగడ్డ సమీపంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..పొన్నలూరు మండలంలో ముప్పాళ్ల గ్రామానికి చెందిన పత్తిపాటి సుబ్బారావు, సింగమ్మలకు ఇద్దరు కుమారులు, ఇద్దరుకుమార్తెలు. చిన్న కుమారుడైన పత్తిపాటి అశోక్(32) కందుకూరు యాక్సిస్ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అశోక్ తండ్రి సుబ్బారావు 9 నెలల క్రితం మృతి చెందాడు. దీంతో నిద్ర చేసేందుకు దర్శిలో ఉన్న సోదరి వద్దకు బుధవారం రాత్రి వెళ్లాడు. గురువారం ఉదయం తన సొంత గ్రామమైన ముప్పాళ్లకు అశోక్ ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో మండలంలోని రేగలగడ్డ సమీపంలోకి రాగానే పొదిలి–టంగుటూరు రహదారిపై ఉన్న గుంటల వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. ప్రమాదంలో అశోక్ తలకు తీవ్ర గాయాలుకావడంతో గ్రామస్తులు 108 వాహనంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకుతరలించారు. తీవ్ర రక్తస్రావం కావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని అక్క స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవికుమార్ తెలిపారు. మృతుడు అశోక్ భార్య హైమావతి నిండు గర్భిణి. డెలవరీ కోసం హైదరాబాద్ వైద్యశాలకు వెళ్లినట్లు బంధువులు తెలిపారు. తండ్రి చనిపోవడంతో అక్క ఇంటి వద్ద నిద్ర చేసేందుకు వెళ్లి కానరాని లోకానికి వెళ్లిపోవడం, నిండు గర్భిణీ అయిన తన కూతురు ఏమైపోవాలి అని విలపించిన తీరు స్థానికులను కంట తడిపెట్టించింది.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రమణారెడ్డి


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేవీ రమణారెడ్డి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పార్టీ కార్యదర్శి కేవీ రమణారెడ్డి తాడేపల్లి కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, మాజీ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ కేవీ ప్రసాద్ ఉన్నారు.

ధ్యానం, వ్యాయామంతో ఆరోగ్యం

- ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు


ఏకేయూలో ఆసనాలు వేస్తున్న విద్యార్థిని

ఒంగోలు సిటీ: ఆరోగ్యాన్ని పెంపొందించడంలో ధ్యానం, వ్యాయామం ముఖ్యమైనవని ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని ఆంధ్రకేసరి యూనివర్శిటీ సమావేశపు హాలులో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమనే సూత్రాన్ని ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. సూర్యోదయాన్నే చేపట్టాల్సిన ధ్యానం, వ్యాయామం తదితర సన్మార్గాల గురించి వివరించారు. వ్యాయామం, ధ్యానం అనేవి వయసుతో నిమిత్తం లేకుండా ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ చేపట్టవచ్చన్నారు. వైద్యులు డాక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పక ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు యోగా మాస్టర్లు యోగాసానలు వేసి చూయించారు. ఏకేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దేవీ వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో లారీ డ్రైవర్ బీభత్సం


తీవ్రంగా గాయపడిన నాగేంద్ర


రోడ్డుపై అడ్డంగా పడిపోయిన పొగాకు చెక్కులు

- ఒకరికి తీవ్ర గాయాలు

బేస్తవారిపేట: మద్యం మత్తులో లారీ డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. ఈ సంఘటన బేస్తవారిపేట బస్టాండ్ ఆవరణలో గురువారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. అర్ధవీడు మండలం కాకర్లకు చెందిన రైతు ట్రాక్టర్‌పై పొగాకు బేళ్లను బేస్తవారిపేట జంక్షన్ వైపునకు తీసుకు వెళ్తున్నాడు. అదే సమయంలో లారీలో బెంగుళూరు నుంచి విజయవాడకు ప్రైవేట్ కంపెనీ బ్యాటరీలను తరలిస్తున్నారు. లారీ డ్రైవర్ పూటుగా మద్యం సేవించి ట్రాక్టర్ వెనుక వైపున ట్రాలీని ఢీకొట్టాడు. దీంతో ట్రాలీలోని పొగాకు బేళ్లు రోడ్డుపై అడ్డదిడ్డంగా పడిపోయాయి. పొగాకు బేళ్లు సర్వీస్ రోడ్డులో తోపుడు బండ్లపై పడటంతో పండ్లు నేలపాలయ్యాయి. ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో కంభం వైపు మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టింది. మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న ఆర్మీ ఉద్యోగి బీరబోయిన నాగేంద్రను మోటార్‌సైకిల్‌తో కొద్ది దూరం లారీ లాక్కెళ్లింది. ప్రమాదంలో నాగేంద్ర చెయ్యి నుజ్జు నుజ్జు కాగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డ్రైవర్ లారీని ఆపకుండా పరారవుతుండటంతో పోలీసులు వెంబడించి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆర్టీసీ బస్టాండ్ వద్ద యాచకుల రచ్చ

- సెల్‌ఫోన్ దొంగిలించి బుకాయింపు
- అరగంట సేపు ఆగిన బస్సు

సింగరాయకొండ: సెల్‌ఫోన్ నాదంటే నాదంటూ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో యాచక కుటుంబానికి, ప్రయాణికునికి మధ్య వివాదం తలెత్తింది. ఈ సంఘటనతో ఆర్టీసీ బస్సు అరగంట పాటు నిలిచిపోయింది. స్థానికుల కథనం ప్రకారం ఆర్టీసీ బస్టాండ్‌లో యాచక కుటుంబానికి చెందిన భార్య, భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తిరుపతి వెళ్తున్న ఆర్టీసీ బస్సులోని ప్రయాణికుడి సెల్‌ఫోన్ బస్టాండ్‌లో చోరీ అయింది. అప్రమత్తంగా ఉన్న ప్రయాణికుడు సెల్‌ఫోన్ చోరీ చేసింది యాచకులేనని గుర్తించి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్ లాక్కున్నాడు. దీంతో ప్రయాణికునికి, యాచకులకు మధ్య సెల్‌ఫోన్ నాదంటే నాదంటూ వివాదం ఏర్పడింది. ఈ క్రమంలో బస్సు అరగంట సేపు రోడ్డుపై ఆగింది. బస్సు కదలకుండా యాచకులు అడ్డుకున్నారు. చివరికి స్థానికులు జోక్యం చేసుకుని ప్రయాణికుడిని, యాచకులను ఆటో ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. ఆటో కొంతదూరం పోయిన తరువాత యాచకులు సెల్‌ఫోన్ ప్రయాణికునికి ఇచ్చి ఆటో దిగి వెళ్లి పోయారు. ఆ తరువాత కూడా యాచకులు రైల్వేస్టేషన్‌లో తిరుగుతుండటంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పొలంలో భారీ అగ్నిప్రమాదం

- రూ.8 లక్షల ఆస్తినష్టం.


అగ్నికి అహుతైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న వీఆర్ఓ

పుల్లలచెరువు: పొలంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకొని రూ.8 లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఈ సంఘటన మండల కేంద్రంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మాజీ మండల అధ్యక్షుడు ఆర్. లక్ష్మీధర్మానాయక్, వారి కుమారులు హరినాయక్, శివాజీనాయక్‌లకు చెందిన పొలంలో వివిధ రకాల పండ్ల మొక్కలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. 5 ఎకరాల జామాయిల్, 100 నిమ్మ, 50 మామిడి, 50 శ్రీగంధం, 20 ఉసిరి చెట్లు, 10 స్తంభాలకు సరిపడే సర్వీస్ వైరు, రూ.3 లక్షల విలువైన డ్రిప్ పరికరాలు మొత్తం పూర్తిగా కాలిపోయినట్లుగా బాధితులు తెలిపారు. సమారు రూ.8 లక్షల మేర నష్టం జరిగిట్లుగా వారు వాపోయారు. ఫైర్‌ఇంజన్ వచ్చే సరికి కొంత మేరకు నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న వీఆర్ఓ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎంత నష్టం వాటిల్లిందో అంచనా వేసి అధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు.

మహిళపై లైంగికదాడి

- కేసు నమోదు చేసిన పోలీసులు

యర్రగొండపాలెం: త్రిపురాంతకం మండలంలోని ఎండూరివారిపాలెంలో మహిళపై లైంగిక దాడి జరిగింది. ఈ మేరకు గురువారం పోలీసులు కేసు నమోదుచేశారు. గ్రామానికి చెందిన మహిళ ఈ నెల 4వ తేది రాత్రి గేదెలకు గడ్డి వేసేందుకు దొడ్డి వద్దకు వెళ్లింది. ఈ సమయంలో నిందితుడు చప్పిడి కోటేశ్వరరావు అక్కడికి వెళ్లి ముందుగా మా గేదే మీ గేదెల వద్దకు వచ్చిందా అని అడిగాడని, ఆ ప్రాంతంలో ఎవ్వరూ లేరని నిశ్చయించుకొని తన నోట్లో దుస్తులు కుక్కి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసును సీఐ అసాన్ ఆధ్వర్యంలో ఎస్సై శివబసవరాజు దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్ దొంగల అరెస్టు

మద్దిపాడు: ఆయిల్ దొంగల ఆట కట్టించారు పోలీసులు. మండల కేంద్రం మద్దిపాడు సమీపంలో ఉన్న లారీ యూనియన్ ఆఫీస్ వద్ద ఇటీవల ఆయిల్ దొంగతనం చేసిన కేసులో దొంగలు పట్టుబడ్డారు. ఎస్సై శివరామయ్య వివరాల మేరకు.. పల్నాడు జిల్లా వినుకొండ నెహ్రూనగర్ తండాకు చెందిన మీరాజాత్ కళ్యాణ్ నాయక్, మీరాజాత్ ప్రేమ్ కుమార్, వినుకొండ పట్టణానికి చెందిన తాడి అమరలింగేశ్వరరావు గత నెల 25వ తేదీ అర్ధరాత్రి సమయంలో లారీ యూనియన్ ఆఫీస్ వద్ద ఆయిల్ దొంగతనం చేశారు. దీనిపై లారీ యూనియన్ నాయకులు పోలీసులు ఫిర్యాదు చేశారు. జాతీయ రహదారిపై పలుచోట్ల లారీల నుంచి ఆయిల్ దొంగతనం చేస్తున్నారన్న ఫిర్యాదులు రావడంతో ఎస్పీ దామోదర్ నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. మద్దిపాడు ఎస్సై, కానిస్టేబుల్ సురేష్, హోంగార్డు శేఖర్‌లు గురువారం ఉదయం 8 గంటల సమయంలో బీట్ నిర్వహిస్తుండగా కొష్టాలు సెంటర్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఆపిన లారీ వెనుక భాగంలో అనుమానాస్పదంగా ఒక బొలెరో వాహనం కనిపించింది. పోలీసులు వారిని పట్టుకొని ప్రశ్నించగా ఆయిల్ దొంగతనం చేస్తున్నట్లు వారు తెలిపారని ఎస్ఐ తెలిపారు. ఈ నేపథ్యంలో వాహనాన్ని సీజ్ చేసి, ముగ్గురిని అదుపులోకి తీసుకొని స్పెషల్ మొబైల్ కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.